క్లుప్తంగా

పాస్టర్ కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

కరప: కూరాడ గ్రామ పాస్టర్ రెవరెండ్ ఎం.కొర్నేలియస్ పది రోజుల కిందట గుండెపోటుతో మరణించారు. బాధిత కుటుంబానికి మండల పాస్టర్ ఫెలోషిప్ ఆర్థిక సాయం అందించింది. జి.రాగంపేటలో సోమవారం జరిగిన ఆదరణ కూడికలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు, రెవ.పాల్‌ప్రసాద్, సెక్రటరీ రెవ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, డి.ఏసురత్నం, ట్రెజరర్ కె.ఆనంద్‌బాబు, కన్వీనర్ పి.సత్యప్రసాద్‌బాబు తదితరులు పాల్గొని, బాధిత కుటుంబానికి రూ.30 వేలు అందించారు.

బాధితుడికి చేయూత



బాధితుడికి నిత్యావసరాలు అందిస్తున్న లక్ష్మీనాగేంద్ర

బోట్‌క్లబ్: ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్న శేఖర్ లివర్ పాడవ్వడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర చేయూత అందించారు. సోమవారం అతని ఇంటికి వెళ్లి నెల రోజులకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అందించారు. వీటిని మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. బాధితుడి ఇబ్బందులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి



వ్యాసరచనలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కరప: మార్కెట్‌లో వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు (బీఐఎస్ మార్క్) కలిగి ఉన్నదీ, లేనిదీ పరిశీలించాలని మెంటార్, హిందీ ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ ఆలీ తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) యాక్టివిటీస్‌లో భాగంగా సోమవారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు జరిపారు. కాజులూరు హైస్కూల్ మెంటార్ చింతా నారాయణమూర్తి పరిశీలకులుగా వ్యవహరించారు. విజేతలకు హెచ్ఎం యు.లీలామనోహర్, స్టాఫ్ సెక్రటరీ శ్రీరామచంద్రమూర్తి, రామ్మోహన్‌రావు, టి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇద్దాం



మున్సిపల్ పార్కులో చెత్తను తొలగిస్తున్న కస్టమ్స్ అధికారులు

కాకినాడ సిటీ: కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. గార్బేజ్ ఫ్రీ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా క్లీనింగ్ డ్రైవ్‌ను స్థానిక వైద్యనగర్ ప్రభుత్వ మున్సిపల్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులోని చెత్తను కస్టమ్ అధికారులు, ఉద్యోగులు తొలగించారు. కస్టమ్స్ సూపరింటెండెంట్లు సీహెచ్ సతీష్‌సింగ్, ఎస్.నరసింహారావు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ ఉద్యోగులు వై.శ్రీనివాస్, ఇ.శ్రీనివాస్‌చౌదరి, ఇన్‌స్పెక్టర్లు ఆర్.రామకృష్ణ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ



కుస్తీ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సుశీల తదితరులు

కాకినాడ రూరల్: పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల కుస్తీ పోటీలలో ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ టి.సుశీల తెలిపారు. 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ త్రిచక్రవేణి 14 ఏళ్ల లోపు కేటగిరీలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. మరో ఏడుగురు విద్యార్థినులు కంచు పతకాలు సాధించారు. విజేతలను, పీడీ టి.శారద, పీఈటీ పద్మలను ఆమె అభినందించారు.

తినొద్దు మైమరచి..

- ఆరోగ్యాన్ని హరించేలా ఆహార పదార్థాలు
- శుభ్రత పట్టించుకోని అనేక హోటళ్లు
- మిగిలిన వంటకాలు నిల్వ చేసి విక్రయాలు



అధికారుల దాడుల్లో బయట పడ్డ నిల్వ ఉంచిన మాంసం (ఫైల్)



కాకినాడలోని ఓ హోటల్‌లో పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

బోట్‌క్లబ్: రంగుల హంగామాలు.. నోరూరించే ఆహార పదార్థాలు.. పొగలు కక్కుతున్నట్లు ప్లేట్‌లో వేడిగా కనిపించే రకరకాల వెజ్.. నాన్‌వెజ్ డిష్‌లు. ఇవన్నీ మనల్ని ఆకర్షించడానికి హోటళ్లలో చేస్తున్న మాయలు, మోసాలు. కానీ వంటశాలలోకి వెళ్లి గమనిస్తే, కాస్త దృష్టిపెట్టి పరిశీలిస్తే ఒళ్లు జలదరించే నిజాలు.. కళ్లు బైర్లు కమ్మించే వాస్తవాలు బయట పడతాయి. ఆ రోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో నిల్వచేసి తర్వాత సాగించే అమ్మకాలు. వాడేసిన నూనెను మళ్లీ మళ్లీ వాడి వండి వారుస్తున్న వైనాలు. ఇలా ప్రజల్ని మైమరపించి అనారోగ్యం బారిన పడేసే వ్యాపారమాయలు అంతా ఇంతా కాదు. మోసాలు, అక్రమాల విషయం తెలియని మనం ఎంతో ఇష్టంగా లొట్టలేసుకుని మరీ ఆహారాన్ని ఆరగిస్తున్నారు. రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ప్రమాదకర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఇటువంటి ఆహారాన్ని అమ్మే కర్రీ పాయింట్లు, హోటళ్లు ఉన్నట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో తేటతెల్లమైంది. అధికారులు తనిఖీలు చేయడమే కాకుండా తర్వాత పక్కా చర్యలు తీసుకుంటే ఫలితం ఉంటుంది.

రెండు నెలలు.. 30 ఫిర్యాదులు

కాకినాడ నగరంలో 130 పైగా వెజ్, నాన్‌వెజ్ హోటళ్లు ఉన్నాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్ వరకూ రకరకాల ఆహారాన్ని ఈ విక్రయశాలలు అందిస్తున్నాయి. వీటిలో పేరుపడని హోటళ్లు మిగిలిపోయిన ఆహారాన్ని నిల్వచేసి తర్వాత అందిస్తున్నట్లు అధికారులు దాడుల్లో ఇటీవల బహిర్గతమైంది. వారం రోజుల కిందట భానుగుడి సెంటర్‌లోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలు నాణ్యత లేకపోవడంతో జేసీ కోర్టులో రూ. 50 వేల అపరాధ రుసుం విధించారు. 20 రోజుల కిందట రామారావుపేటలోని సుబ్బయ్య హోటల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలో పలు ఆహార పదార్థాలు నాణ్యత లేకపోవడంతో వాటిని ల్యాబ్‌కు పంపారు. కాకినాడలో రెండు నెలల నుంచి 30కి పైగా ఫిర్యాదులు అందినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు.

బిర్యానీ.. చికెన్ .. ఎప్పటివో?

రాత్రి మిగిలిన బిర్యానీ, చికెన్‌ను మరుసటి రోజు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల ప్రకారం వాటిని మరుసటి రోజు విక్రయించరాదు. కేవలం పచ్చి మాంసం, నిర్ణీత టెంపరేచర్‌లో ఉంచుకోవాలి. కానీ హోటళ్లలో సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరీ మాంసం మరుసటి రోజు వినియోగదారులకు వండి విక్రయిస్తున్నారు.

కలుషిత ఆహారంతో అనారోగ్యం



కలుషిత ఆహారంతో అనారోగ్యం బారిన పడతారు. బయట హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద తీసుకొనే ఆహారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మాంసాహారంలో రంగులు కలపడంతో కేన్సర్‌కు దారితీస్తుంది. వంటల్లో వాడే ఫుడ్ కలర్, అజినోమోటో, నిల్వ ఉంచిన మాంసం తినడం ఆరోగ్యానికి అనర్థం.

–డాక్టర్ చిట్ల కిరణ్, ఎండీ, ఓ ఎమర్జెన్సీ ఆసుపత్రి

ఫిర్యాదు చేస్తే చర్యలు



ఆహార పదార్థాలకు రంగులు వేసి విక్రయించినా, పాడైన పదార్థాలు విక్రయించినా వినియోగదారులు తనకు ఫిర్యాదు చేస్తే సంబంధిత హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకుంటాం. వండిన ఆహార పదార్థాలు అసలు ఫ్రిజ్‌లో పెట్టి విక్రయించడం చట్టరీత్యా నేరం.

–శ్రీనివాస్, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

ఉండ్రాళ్లయ్యా.. వెళ్లిరావయ్యా



కాకినాడ బీచ్‌లో నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు



ద్వారకానగర్‌లో సరస్వతీ పూజల్లో చిన్నారులు



వేలం పాటలో రూ.36 వేలకు దక్కించుకున్న లడ్డూతో సభ్యులు

కాకినాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కొలువైన గణనాథ విగ్రహాల నిమజ్జనోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్ వద్ద సముద్రంలో వినాయక విగ్రహాలు నిమజ్జనాల సందడి నెలకొంది. భక్తుల కోలహలం మధ్య స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. బుధ, గురువారాల్లో పెద్దఎత్తున జరిగే నిమజ్జనోత్సవాలకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలతో అధికార యంత్రాంగం ఏర్పాటు చేస్తుంది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచనల మేరకు పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహింది.

బోట్‌క్లబ్: నగరంలో వినాయక నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక 44వ డివిజన్ ద్వారకానగర్‌లోని వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి సరస్వతీ పూజలు జరిగాయి. నిర్వాహకుడు అంకం రెడ్డి రామునాయుడు ఆధ్వర్యంలో చిన్నారుల సరస్వతీ పూజకు కావాల్సిన పూజా సామాగ్రి అందించారు. అనంతరం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. వై.నాగేశ్వరరావు, వీరబాబు, శ్రీనివాస్, కొండపల్లి అర్జున్, సురేష్ పాల్గొన్నారు.

రూ.36 వేలు పలికిన లడ్డూ

కాకినాడ రూరల్: రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని సర్పవరం మార్గంలో డ్యూయల్ మెడోస్ అపార్ట్‌మెంట్ల వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం నిర్వహించారు. ఏఎస్‌వీ ప్రసాద్ సమర్పించిన 11 కిలోల లడ్డూను జ్యూయల్ మెడోస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ వనమా మరిడిరాజు రూ.36 వేలకు దక్కించుకున్నారు. మరో లడ్డూను డ్యూయల్ మెడోస్ వైష్ణవి దేవి మహిళలు రూ.16 వేలకు, చిన్న లడ్డూను రూ.10 వేలకు విజయబాబు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ అడపా బాబు, కంతేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

- వాకలపూడి సంతోష్‌నగర్‌లో కేటీసీ సంస్థ కార్యాలయం వద్ద నియోజకవర్గంలో 100 వినాయక మండపాలకు 50 కిలోల చొప్పున బియ్యాన్ని ఆ సంస్థ అధినేత ఎస్ఎస్ కిరణ్‌కుమార్ పంపిణీ చేశారు. ప్రవీణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.
- గణేశ విగ్రహాల నిమజ్జనోత్సవంలో భాగంగా సూర్యారావుపేట బీచ్‌లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ చెప్పారు. తహసీల్దార్ మోరార్జీ, ఎంపీడీఓ స్వప్న, పోలీసులు, ఇతర అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో బీటెక్ సీఎస్ఈ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు విప్రో ఇంటర్న్‌షిప్‌కు సెలక్షన్స్ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ విప్రో ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థుల జీవితంలో ఎదుగుదలకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి ఎంపికైన విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, యంగ్యులర్ జేఎస్ అంశాలలో 3 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ ఇన్‌చార్జి వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, సీఎస్ఈ హెడ్ ఒ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- వ్యాయామ విద్యలో 0.5 క్రెడిట్స్ కేటాయించిన విధంగా గ్రంథాలయ పఠనానికి క్రెడిట్స్ కేటాయించేలా ఆలోచన చేయాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ సోమవారం జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజును కోరింది. క్రెడిట్స్ కేటాయించడం ద్వారా తప్పకుండా విద్యార్థులు రోజూ గ్రంథాలయాలను సందర్శిస్తారన్నారు.

3 నుంచి బ్యాలెట్ యూనిట్ల తనిఖీ



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో అక్టోబర్ మూడో తేదీ నుంచి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మొదటి స్థాయి తనిఖీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటింగ్ యంత్రాల మొదటి స్థాయి తనిఖీ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక శిక్షణ ఇంటర్నెట్ ఏర్పాట్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు, రూరల్ తహసీల్దార్ మురార్జీ, ఏవో వరహాలయ్య, వన్‌టౌన్ ఎస్ఐ శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న ఒలింపిక్ సంఘ కౌన్సిల్ సమావేశం

నాగమల్లితోట జంక్షన్: స్థానిక రాయల్‌పార్కు హోటల్‌లో జిల్లా ఒలింపిక్ సంఘ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం 28న మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి సోమవారం తెలిపారు. గత సమావేశంలోని మినిట్స్ ఆమోదించడం, ఇటీవల ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ కె.స్వర్ణరాజు మరణించడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి కార్యదర్శి నియామకం, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఖాళీ పదవుల్లో అర్హులను నియమించడం, 2023–24 సంవత్సరానికి మినీ ఒలింపియాడ్ నిర్వహణ తదితర అంశాలు ప్రధాన అజెండాగా సమావేశం ఉంటుందన్నారు.

ఖోఖో జట్ల ఎంపిక..

జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో 28న జిల్లా స్థాయి బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పట్టాభి సోమవారం తెలిపారు. స్థానిక జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఎంపికలకు 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన జట్లు అక్టోబర్ 20 నుంచి 22 వరకూ చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగే 42వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఖోఖో చాంపియన్ షిప్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరువున పాల్గొంటారన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

బోట్‌క్లబ్: బీజేపీ మూలపురుషుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య అన్నారు. సోమవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని సౌత్ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. పార్టీ శక్తి కేంద్ర ప్రముఖ్ బందరు మిఠాయి నెహ్రూ, సిటీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ, నాయకులు దొడ్డి వీరేంద్ర, చెల్లూరి సత్యనారాయణ, అంబిక పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి

బాలాజీచెరువు: ప్రస్తుత ఏడాది నిర్వహించే అంతర్ జిల్లాల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి తెలిపారు. విజయవాడలో 67వ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ వర్క్‌షాపులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్– 14, 17 అంశాల్లో 171 పాయింట్లతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా తన కార్యాలయంలో స్కూల్ గేమ్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీఎస్ ప్రసాద్‌ను సత్కరించి అభినందించారు. వచ్చే ఏడాది జిల్లా ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

యోగాతో ఒత్తిడి దూరం



జిల్లా స్థాయి యోగా పోటీల్లో విజేతలతో యోగా గురువు చిట్టిబాబు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యోగా సాధనతో ఒత్తిడిని దూరం చేయవచ్చని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. స్థానిక శ్రీనగర్‌లోని ఆదిత్య ఇండోర్ హాల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు సోమవారంతో ముగిశాయి. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. గౌరవ అతిథులుగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ ఎస్‌పీఎంసీఐఎల్ స్వతంత్ర డైరెక్టర్ చిరుకూరి రామ్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి హాజరయ్యారు. యోగా గురు పతంజలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. యోగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చిట్లూరి చిట్టిబాబు, వీరబాబు, కె.సతీష్, ప్రధాన కార్యదర్శి డి.సత్యప్రియ పాల్గొన్నారు.

దైవసేవే పరమావధిగా సాగాలి

కరప: పాస్టర్లు దైవసేవే పరమావధిగా ముందుకు సాగాలని చెన్నై నుంచి వచ్చిన షిలోహ్ మిషన్ సంస్థ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ దయాలన్ ఎడ్వర్డ్, షిలోహ్ మిషన్ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ జాన్సన్ అన్నారు. నడకుదురులోని బిలీవర్స్ చర్చ్‌లో సోమవారం మండల ఫెలోషిప్ ప్రెసిడెంట్ మేడపాటి రాజ్‌కుమార్ అధ్యక్షతన పాస్టర్ల సమావేశం జరిగింది. దైవసేవకులు కె.ఆశీర్వాదం, వి.గాబ్రియేల్, కె.ప్రసన్నరాజు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

కాకినాడ సిటీ: పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఫ్యాప్టో సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద సోమవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. అసోసియేషన్ నాయకులు మొండి రవికుమార్, కుసుమంచి కాశీవిశ్వనాథ్, చింతా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్పీ బాలు వర్ధంతి

కాకినాడ రూరల్: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం అమృతమని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు అన్నారు. సర్పవరం జంక్షన్‌లోని బోటుక్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి జరిగింది. అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, కె.మునిరెడ్డి, అడబాల సత్యనారాయణ, ఎస్.శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

కాకినాడ రూరల్: స్థానిక రాజ్యలక్ష్మీ సమేత భావన్నారాయణస్వామి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఒక అజ్ఞాత భక్తుడు హుండీలో రూ.లక్ష విలువైన 500 నోట్ల కట్టలు విరాళంగా వేశారని ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. నగర నూకాలమ్మ ఆలయ ఈఓ లక్ష్మణ్, సర్పవరం ఆలయ ఈఓ భీమశంకర్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టగా రూ.4,44,943 ఆదాయం లభించింది.

భూ కబ్జాపై ఫిర్యాదు

కాకినాడ రూరల్: తూరంగిలోని రమణయ్యపేట శ్రీవిష్ణాలయానికి చెందిన భూమి కబ్జాపై కమిటీ సభ్యులు కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ సుబ్బారావు, ఇంద్రపాలెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. 1936లో తూరంగికి చెందిన దాత కుందూరు సుబ్బారావు 30 సెంట్ల భూమిని ఆలయానికి దానంగా ఇచ్చారని, ఆ భూమిలో లేఅవుట్‌లు వేసేందుకు కొందరు కొడా అప్రూవల్ కోరినట్లు సమాచారం తెలియడంతో ఫిర్యాదు చేశామని కమిటీ సభ్యులు పాలిక నరసింహమూర్తి, గంజా సత్తిబాబు, పాలిక శ్రీనివాస్, చిన్న అప్పారావు తెలిపారు.

వైద్య వృత్తుల్లో ఫార్మసీ కీలకం

కాకినాడ రూరల్: వైద్య వృత్తుల్లో ఫార్మసీ కూడా కీలకమని జీజీహెచ్ ఫార్మసిస్ట్ విభాగం అధిపతి సరిపల్లి ప్రభుదాస్ అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మాసిస్ట్‌ల దినోత్సవం జరిగింది. న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫార్మాసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం ప్రభుదాసును సత్కరించారు. అడబాల రత్న ప్రసాద్, కె.మునిరెడ్డి, ఎస్.శ్రీనగేష్ పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

కరప: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలవ్వగా జీజీహెచ్‌లో చికిత్స పొందుతుందని కరప ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. వేళంగి దళమ్మ చెరువుగట్టు వీధికి చెందిన చింతపల్లి రత్నం పాల కోసం వెళుతూ రోడ్డు పక్కన నిలబడింది. అదే సమయంలో పెదకొత్తూరుకు చెందిన పసుపులేటి ఈశ్వరరావు బైక్‌పై వేగంగా వచ్చి, ఆమెను ఢీకొన్నాడు. రత్నంకు తీవ్ర గాయాలయ్యాయి.

ఖైదీ మృతిపై విచారణకు నిర్ణయం

కాకినాడ సిటీ: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన పాలెం హరీష్‌కుమార్ అనారోగ్యంతో జీజీహెచ్‌లో చేరి గత ఏడాది అక్టోబర్‌న మరణించాడు. దీనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ విషయమై ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అక్టోబర్ 7న ఉదయం 11 గంటలకు మెజిస్ట్రీరియల్ విచారణ చేయాలని నిర్ణయించారు.

'ఆదిత్య' విద్యార్థినికి సత్కారం



విద్యార్థి ఈశ్వరప్రసన్న కావ్యను సత్కరిస్తున్న విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

బాలాజీచెరువు: పదో తరగతి 2023 ఫలితాల్లో 595 మార్కులతో రాష్ట్ర స్థాయి 3వ స్థానం సాధించిన ఆదిత్య గొల్లలమామిడాడ పాఠశాల విద్యార్థి కె.ఈశ్వరప్రసన్న కావ్యను సోమవారం సత్కరించారు. గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సమావేశంలో పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ఆమెను సత్కరించారు. ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రరెడ్డి, టి.కల్పలత, పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారని పాఠశాల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి తెలిపారు.

నిమజ్జనానికి సౌకర్యాలు కల్పించండి



తహసీల్దార్ మురార్జీకి వినతి అందిస్తున్న మాలకొండయ్య, వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: స్థానిక సూర్యారావుపేట బీచ్‌లో బుధ, గురువారాల్లో జరిగే వినాయక నిమజ్జనాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. నగర ఉత్సవ కమిటీ, రూరల్ ఉత్సవ కమిటీ కన్వీనర్లు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు తదితరులు సోమవారం కాకినాడ రూరల్ తహసీల్దార్ మురార్జీ, రూరల్ సీఐ శ్రీనివాసరావులను కలిశారు. బీచ్‌లో విద్యుత్ దీపాలు, బారికేడ్లు, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. బీచ్‌లో రక్షణ చర్యలపై సీఐతో మాట్లాడారు. కార్యక్రమంలో బొలిశెట్టి రామకృష్ణ, పెండెం సత్యనారాయణ, కవికొండల చలపతి, అనపర్తి వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



డాక్టర్ లావణ్యకుమారిని ర్యాలీగా తీసుకువస్తున్న సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన లావణ్యకుమారికి ఆసుపత్రి సిబ్బంది ఘన స్వాగతం పలికారు. సోమవారం ఆసుపత్రిలోని ఎస్ఆర్ఎంటీ భవనం నుంచి ఆమెను వందలాది సిబ్బంది అనుసరిస్తూ వెల్కం మేడం అంటూ ఆహ్వానించారు. తొలుత సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమెను సత్కరించారు. తర్వాత పూర్వపు సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని సత్కరించి ఘన వీడ్కోలు పలికారు. విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ వీవీ బుద్ధా మాట్లాడుతూ డాక్టర్ లావణ్యకుమారి నిబద్ధతకు తగిన గౌరవం దక్కిందన్నారు. డాక్టర్ లావణ్య, డాక్టర్ హేమలతా దేవిలను అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విష్ణువర్ధన్ బృందం సత్కరించింది.